సాక్షి
డా. బి ఆర్ అంబేడ్కర్ కోనసీమ

శుక్రవారం । 15 । ఆగస్టు । 2025



మాస్టార్‌కి బుక్కు రిబిక్కిరి

ప్రభుత్వ పాఠశాలల్లో అభ్యసన సామర్థ్యాలను అంచనాకు ఏటా పరీక్షలు నిర్వహిస్తారు. నాలుగు సెల్ఫ్ అసెస్‌మెంట్, రెండు సమ్మేటివ్ పరీక్షలు నిర్వహిస్తారు.



కొబ్బరి చెక్క.. సిరులు పక్కా

ప్రముఖ పుణ్యక్షేత్రమైన అన్నవరం సత్యనారాయణస్వామి దేవస్థానంలో కొబ్బరి ముక్కల వేలం రికార్డు ధరకు ఖరారైంది. ఈ సారి రూ.19.05 లక్షలకు వేలం వెళ్లింది.

II లో

1.98 లక్షల క్యూసెక్కుల విడుదల



ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి గురువారం సాయంత్రం 1,98,959 క్యూసెక్కుల మిగులు జలాలను సముద్రంలోకి విడుదల చేశారు. నీటి మట్టం 10 అడుగులకు చేరింది. గోదావరి డెల్టా కాలువలకు సంబంధించి 3,200 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు.

న్యూస్‌రీల్

సమాచార హక్కు చట్టంపై ర్యాలీ



అమలాపురంలో ర్యాలీ నిర్వహిస్తున్న జిల్లా సహకార అధికారులు, ఉద్యోగులు

అమలాపురం టౌన్: సమాచార హక్కు మన ప్రాథమిక హక్కు అనే నినాదంతో జిల్లాలోని సహకార శాఖ ఉద్యోగులు అమలాపురంలో గురువారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. జిల్లా సహకార అధికారి ఎ.రాధాకృష్ణారావు, సహకార అసిస్టెంట్ రిజిస్ట్రార్లు బీఎల్‌వీపీ నూకరాజు, టి.బుజ్జయ్య, సత్యప్రసాద్ ఈ కార్యక్రమానికి నాయకత్వం వహించారు. కూచిమంచి అగ్రహారంలోని జిల్లా సహకారి అధికారి (డీసీవో) కార్యాలయం వద్ద ర్యాలీని డీసీవో రాధాకృష్ణారావు జెండా ఊపి ప్రారంభించారు. జిల్లా డీసీవో కార్యాలయ అధికారులు, సిబ్బంది, 166 ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల సీఈవోలు, ఉద్యోగులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా డీసీవో రాధాకృష్ణారావు మాట్లాడుతూ సమాచార హక్కు చట్టంపై ప్రతి పౌరుడు అవగాహన కలిగి ఉండాలన్నారు. ఈ చట్టం ద్వారా ప్రభుత్వ కార్యాలయాలు జవాబుదారీతనంతో పనిచేస్తాయని గుర్తు చేశారు. కాగా.. జిల్లా సహకార కార్యాలయం నుంచి మొదలైన ర్యాలీ.. బ్యాంక్ స్ట్రీట్ మీదుగా గడియారం స్తంభం సెంటర్ వరకూ జరిగింది.

ఆక్వా చెరువుల్లో నమూనాల సేకరణ

రామచంద్రపురం రూరల్: ఆక్వా సాగులో ప్రబలుతున్న వ్యాధుల పర్యవేక్షణ, నివారణకు నేషనల్ సర్వైలెన్స్ ప్రోగ్రామ్ ఫర్ ఆక్వాటిక్ యానిమల్ డిసీజ్–ఫేజ్ 2 ప్రాజెక్టులో భాగంగా ఆక్వా రైతులకు సహాయ సహకారాలు అందించనున్నట్లు ఫిషరీస్ అసిస్టెంట్ డైరెక్టర్ కె.శ్రావణి తెలిపారు. తాటిపల్లి, చోడవరం గ్రామాల్లోని ఆక్వా చెరువుల నుంచి వ్యాధి నిర్ధారణకు గురువారం నమూనాలు సేకరించారు. ఆ శాఖ అడిషనల్ డైరెక్టర్ డాక్టర్ ఎస్.అంజలి ఆదేశాల మేరకు ఎన్ఎస్‌పీఏఏడీ బృందం సభ్యులు శివరామకృష్ణ, డి.వంశీ, వి.కృష్ణకిశోర్ పాల్గొన్నారు.

17న అరటి మార్కెట్‌కు సెలవు

అంబాజీపేట: స్థానిక మార్కెట్ యార్డులో నిర్వహిస్తున్న అరటి మార్కెట్‌కు ఈ నెల 17వ తేదీన సెలవు ప్రకటించినట్లు మార్కెట్ కమిటీ ఉన్నత శ్రేణి కార్యదర్శి ఐ.రమేష్ తెలిపారు. నూతనంగా నియమితులైన మార్కెట్ కమిటీ పాలకవర్గ ప్రమాణ స్వీకారం సందర్భంగా అరటి మార్కెట్ సెలవు ఇచ్చినట్లు తెలిపారు. రైతులు సహకరించాలని కార్యదర్శి కోరారు.

రత్నగిరి కిటకిట



సత్యదేవుని వ్రతాలు ఆచరిస్తున్న నవ దంపతులు, భక్తులు

అన్నవరం: రత్నగిరి సత్యదేవుని ఆలయం గురువారం వేలాదిగా తరలివచ్చిన భక్తులతో కిటకిట లాడింది. రత్నగిరిపై బుధవారం రాత్రి, గురువారం తెల్లవారుజామున పెద్ద సంఖ్యలో వివాహాలు జరిగాయి. వివాహాలు చేసుకున్న నవ దంపతులు వారి బంధువులు సత్యదేవుని వ్రతాలు ఆచరించి స్వామివారిని దర్శించారు. పెళ్లిబృందాలు తమ వాహనాలను ఘాట్‌రోడ్డుకు ఇరువైపులా నిలిపివేయడంతో ఉదయం పది గంటల వరకు ఘాట్‌రోడ్లలో వాహనాల రాకపోకలకు అంతరాయం కలిగింది. కాగా, గురువారం స్వామివారి వ్రతాలు 2,500 నిర్వహించారు. సుమారు 40 వేల మంది భక్తులు సత్యదేవుని దర్శించారు. సత్యదేవుని నిత్యాన్నదాన పథకంలో ఐదు వేల మంది అన్న ప్రసాదం స్వీకరించారు.

నిజరూప దర్శనంతో పులకించిన భక్తులు

కాగా, గురువారం సందర్భంగా సత్యదేవుడు, అనంతలక్ష్మీ సత్యవతీదేవి, శంకరుల నిజరూప దర్శనంతో భక్తులు పులకించారు. ప్రతి సోమవారం ముత్యాల కవచాలతో, గురువారం ఏ విధమైన అలంకరణ లేకుండా నిజరూప దర్శనంతో అలంకరిస్తున్న విషయం తెలిసిందే.

నేడు బీఎస్‌ఎన్‌ఎల్ మేళాలు, రోడ్‌షోలు

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా శుక్రవారం పలు ప్రాంతాలలో మేళాలు, రోడ్ షోలు నిర్వహిస్తున్నామని బీఎస్ఎన్ఎల్ ప్రిన్సిపల్ జనరల్ మేనేజర్ పలివెల రాజు ఓ ప్రకటనలో తెలిపారు. కేవలం ఒక్క రూపాయికే ఒక సిమ్ కార్డ్ అందిస్తున్నామని, దానితో 30 రోజుల పాటు రోజుకు 2 జీబీ డేటా, అపరిమిత కాల్స్ బీఎస్ఎన్ఎల్ అందిస్తుందన్నారు. అందరూ ఈ ఆఫర్‌ను వినియోగించుకోవాలని ఆయన కోరారు



అంబాజీపేట మండలం మాచవరంలో మరమ్మతులకు నోచుకోని డ్రైనేజీ



అంబాజీపేట మండలం గంగలకుర్రు అగ్రహారంలో పూర్తి కాని రోడ్డు



రావులపాలెం మండలం ఊబలంకలో ఆగిపోయిన సీసీ రోడ్డు నిర్మాణం

కాసు కోలేక..

- పంచాయతీలకు నిధుల కొరత
- విడుదల చేయని కూటమి సర్కార్
- సర్పంచ్‌లు గగ్గోలు పెడుతున్నా పట్టించుకోని వైనం
- కుంటుపడిన పల్లెల ప్రగతి
- భారంగా మారిన గ్రామాల నిర్వహణ



అమలాపురం మండలం వన్నెచింతలపూడి నుంచి సవరప్పాలెం వెళ్లే రహదారి దుస్థితి

సాక్షి, అమలాపురం: గ్రామ పంచాయతీలపై కూటమి ప్రభుత్వం చిన్నచూపు చూస్తోంది. ఆర్థిక సంఘం నిధులు ఇవ్వకుండా పాలకులను ఇబ్బంది పెడుతోంది. రాష్ట్ర ప్రభుత్వ వైఖరి కారణంగా నిధుల కోసం పంచాయతీలు ఎదురుచూడాల్సిన పరిస్థితి ఏర్పడింది. గత ప్రభుత్వ హయాంలో ఆర్థిక సంఘం నిధుల విడుదల కాస్త ఆలస్యమైతే చాలు నానాయాగి చేసిన కూటమి నాయకులు.. అధికారంలోకి వచ్చిన తర్వాత సైలెంట్ అయిపోయారు. రాష్ట్ర ప్రభుత్వం 15వ ఆర్థిక సంఘం నిధులను దారి మళ్లించి పంచాయతీలను ఆర్థిక ఇక్కట్లుకు గురి చేస్తోంది. వీటితో పాటు పంచాయతీలకు రావాల్సిన రిజిస్ట్రేషన్ సొమ్ముల వాటా ఇవ్వకుండా, ఇతర రూపాల్లో వచ్చే నిధులు రాకుండా చేసి పల్లె పాలనకు గ్రహణం పట్టిస్తోంది.

నిధుల పక్కదారి

గ్రామ పంచాయతీలకు కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన 15వ ఆర్థిక సంఘం నిధులను రాష్ట్ర ప్రభుత్వం పక్కదారి పట్టించింది. 2024–25 సంబంధించి కేంద్ర ప్రభుత్వం ఒక క్వార్టర్ సొమ్ములను గత ఏడాది మార్చిలో మంజూరు చేసింది. అలాగే 2025–26కు సంబంధించి తొలి క్వార్టర్ నిధులు జూలైలో విడుదల చేసింది. ఈ రెండు క్వార్టర్ నిధులను కూడా రాష్ట్ర ప్రభుత్వం దారి మళ్లించింది.

జిల్లాలో 385 పంచాయతీలు

జిల్లాలోని 385 పంచాయతీలలో సుమారు 15,43,215 మంది జనాభా ఉన్నారు. ఒక్కొక్కరికీ రూ.550 చొప్పున ఏడాదికి రూ.84.87 కోట్లు రావాల్సి ఉంది. కేంద్ర ఇచ్చిన గత ఏడాది, ఈ ఏడాది ఈ రెండు క్వార్టర్లు కలిపి కూడా ఇంచుమించి రూ.84 కోట్ల వరకూ ఉంటుందని అంచనా. కేంద్రం ఇచ్చిన నిధులు తమకు ఇవ్వలేదని పంచాయతీ సర్పంచ్‌లు రోడ్డు ఎక్కడంతో నిధులు విడుదల జాప్యం చేసేందుకు గతంలో చేసిన పనులకు యూసీలు ఇవ్వాల్సిందిగా రాష్ట్ర ప్రభుత్వం పంచాయతీలపై ఒత్తిడి తెచ్చింది. యూసీలు ఇచ్చినప్పటికీ సొమ్ములు ఇవ్వకపోవడం గమనార్హం.

రెండు రకాలుగా వినియోగం

ఆర్థిక సంఘం నిధులను టైడ్, అన్‌టైడ్ అనే రెండు విధాలుగా వినియోగించుకునేందుకు పరిమితులు విధించారు. టైడ్ నిధులను తాగునీటి సరఫరా, బ్లీచింగ్, ముగ్గు, మరుగుదొడ్ల నిర్వహణ, మరుగుదొడ్ల నిర్మాణం వంటి పనులకు ఉపయోగించాలి. అన్‌టైడ్‌కు కేటాయించిన నిధులను విద్యుత్ దీపాల కొనుగోలు, నిర్వహణ, కొత్త రోడ్ల నిర్మాణం, పాత రోడ్లకు మరమ్మతులు, కొత్త డ్రైనేజీల నిర్మాణం వంటి పనులకు వెచ్చించాలి.

ఆగిపోయిన అభివృద్ధి పనులు

15వ ఆర్థిక సంఘం నిధులు వస్తాయని నమ్మకంతో చాలా పంచాయతీలు అన్‌టైడ్ విభాగంలో రోడ్లు, డ్రైనేజీల నిర్మాణాన్ని పెద్ద ఎత్తున చేపట్టారు. అలాగే మరి కొన్ని పనులకు ప్రతిపాదనలు సిద్ధం చేసి నిధుల కోసం ఎదురు చూస్తున్నారు. రెండు దఫాలుగా నిర్మించే రోడ్ల పనులు తొలి విడత జరిగాయి. రెండో విడత పనులను సొమ్ములు వస్తేనే చేస్తామని కాంట్రాక్టర్లు భీష్మించారు. దీనితో కొన్ని రోడ్లు, డ్రైనేజీలు సగంలోనే నిలిచిపోయాయి. ఉదాహరణకు అంబాజీపేట మండలం మాచవరం పంచాయతీకి రూ.40 లక్షల వరకు రావాల్సి ఉంది. ఈ సొమ్ములతో పనులు చేపట్టారు. రెండు టర్మ్‌లో నిధులు వస్తాయని ఇక్కడ రూ.70 లక్షల వరకు పనులు చేయించారు. కానీ సొమ్ములు రాలేదు. తీరా నెలల పాటు సొమ్ములు రాకపోవడంతో కాంట్రాక్టర్లకు సమాధానం చెప్పలేక లబోదిబోమంటున్నారు.

బ్లీచింగ్‌కూ డబ్బుల్లేవు

ప్రస్తుతం పంచాయతీల వద్ద బ్లీచింగ్ కొనుగోలు చేసేందుకు సైతం డబ్బులు లేకుండా పోయాయి. ఇప్పటికే గోదావరికి రెండుసార్లు స్వల్పంగా వరద వచ్చింది. ముందు భారీ వరదలు వచ్చే అవకాశం ఉంది. ఇప్పటి వరకు వర్షాభావ పరిస్థితులు నెలకొన్నప్పటికీ అల్పపీడన ప్రభావం వల్ల బుధవారం మధ్యాహ్నం నుంచి జిల్లా వ్యాప్తంగా భారీ వర్షాలు మొదలయ్యాయి. ఈ సమయంలో పారిశుధ్య చర్యలకు బ్లీచింగ్, ముగ్గు అత్యవసరం. వర్షాలపై సమీక్షలు జరిపిన ఉన్నతాధికారులు పంచాయతీలలో అవసరమైన మేరకు బ్లీచింగ్, ముగ్గు సిద్ధం చేసుకోవాలని సలహా ఇచ్చి చేతులు దులుపుకొన్నారు.

నిధులకు బ్రేకులు

పంచాయతీలకు వచ్చే ఆర్థిక సంఘం నిధులు రాకపోవడానికి తోడు, ఇతర మార్గాలలో వచ్చే నిధులకు సైతం కూటమి ప్రభుత్వం బ్రేకులు వస్తోంది. ఇటీవల 300 గజాలకు పైబడి నిర్మించే ఇళ్లకు అనుమతులు పంచాయతీలకు కాకుండా అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీకి అప్పగించింది. దీనితో వాటిపై వచ్చే ఆదాయం కూడా రాజమహేంద్రవరం అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (రుడా), అమలాపురం అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (అముడా)లకు వెళ్లిపోతున్నాయి. భూముల రిజిస్ట్రేషన్‌కు సంబంధించి వస్తున్న ఆదాయంలో పంచాయతీలకు రావాల్సిన వాటా సొమ్ములను కూడా కూటమి ప్రభుత్వం అందించడం లేదు.

తీవ్ర ఇబ్బంది



కేంద్ర ప్రభుత్వం 15వ ఆర్థిక సంఘం నిధులు మంజూరు చేసినా రాష్ట్ర ప్రభుత్వం వాటిని పంచాయతీలకు ఇవ్వలేదు. దీనివల్ల చిన్న పంచాయతీలలో అభివృద్ధి పనులు చేసేందుకు వీలు కలగడం లేదు. పంచాయతీల నిర్వహణ కూడా భారంగా మారుతోంది. వెంటనే ఆర్థిక సంఘం నిధులు విడుదల చేయాలి.

– సబ్బితి మోహనరావు, సర్పంచ్, గోపాలపురం, రావులపాలెం పంచాయతీ

తక్షణం నిధులు ఇవ్వాలి



మైనర్ పంచాయతీలే కాదు, మేజర్ పంచాయతీలకు కూడా నిధులు ఇబ్బంది ఉంది. పారిశుధ్య చర్యలు, విద్యుత్ బిల్లులకు అప్పులు చేయాల్సి వస్తోంది. ఇంచుమించు ఏడాది నుంచి ఆర్థిక సంఘం నిధులు విడుదల చేయలేదు. రోడ్లు, డ్రైనేజీ నిర్మాణాలు నిలిచిపోయాయి. చేసిన పనులకు బిల్లులు ఇవ్వలేకపోతున్నాం.

– నక్కా అరుణకుమారి, మండల సర్పంచ్‌ల సమాఖ్య అధ్యక్షురాలు, కామనగరువు సర్పంచ్, అమలాపురం మండలం

నిర్వహణ భారం

పంచాయతీలకు పన్ను వసూలు, మార్కెట్ పాటల మీద వచ్చే ఆదాయం తప్ప, మిగిలిన నిధులు రావడం లేదు. దీనితో పంచాయతీల నిర్వహణ ఇబ్బందికరంగా మారిందని సర్పంచ్‌లు గగ్గోలు పెడుతున్నారు. మరీ ముఖ్యంగా మైనర్ పంచాయతీల పరిస్థితి దారుణంగా ఉంది. బయట నుంచి అప్పులు తెచ్చి పంచాయతీలు నడపాల్సి వస్తోందని వాపోతున్నారు. జిల్లాలో 90 శాతానికి పైగా పంచాయతీ సర్పంచ్‌లు వైఎస్సార్ సీపీకి చెందిన వారే కావడంతో ప్రభుత్వం కావాలనే నిధులు అందకుండా చేస్తోందనే విమర్శలు కూడా ఉన్నాయి.

రికార్డుల భద్రతకు చర్యలు

- కలెక్టర్ మహేష్ కుమార్
- ముంపు బారిన పడిన కార్యాలయాల పరిశీలన



ముమ్మిడివరం పోలీస్ స్టేషన్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ మహేష్‌కుమార్

ముమ్మిడివరం: భారీ వర్షాల నేపథ్యంలో పల్లపు ప్రాంతాలలో ఉన్న కార్యాలయాల్లో రికార్డుల భద్రతకు చర్యలు చేపట్టాలని కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్ సంబంధిత అధికారులకు ఆదేశించారు. ఆయన గురువారం ఇన్‌చార్జి డీఆర్‌ఓ కె.మాధవితో కలిసి ముమ్మిడివరంలో పోలీస్ స్టేషన్, తహసీల్దార్ కార్యాలయం, ఉప ఖజానా అధికారి కార్యాలయాలను సందర్శించారు. భద్రపర్చిన రికార్డులు, రూములు, కంప్యూటర్లను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా బుధవారం భారీ వర్షం కురిసిన నేపథ్యంలో పల్లపు ప్రాంతంలోని ఈ మూడు కార్యాలయాలను పరిశీలించామన్నారు. కార్యక్రమంలో సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ఎం.మోహన్ కుమార్, మండల పరిషత్ అధికారి టి.ఆచార్య, తహసీల్దార్ టి.సుభాష్, రెవెన్యూ, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

నీటి భద్రత, సంరక్షణపై దృష్టి


అమలాపురం రూరల్: నీటి భద్రత, సంరక్షణ, సమర్థ వినియోగంపై ప్రత్యేక దృష్టి సారించాలని నీటి సంఘాల ప్రతినిధులకు కలెక్టర్ మహేష్ కుమార్ సూచించారు. భూగర్భ జలాల పెంపుదలపై అమరావతి నుంచి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు గురువారం కలెక్టర్లతో మాట్లాడారు. దానిలో పాల్గొన్న అనంతరం మహేష్ కుమార్ ఈ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఎప్పటికప్పుడు పంట కాలువలు, డ్రైనేజీల్లో పూడికతీత పనులు చేపడుతూ రైతాంగానికి ముంపు బెడద లేకుండా చూడాలన్నారు. మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం అనుసంధానంతో జలవనరులశాఖ నిధులతో కాలువల చిట్టచివరి ఆయకట్టు వరకు నీరు అందేలా సాగునీటి వ్యవస్థల పనితీరును మెరుగు పరచాలన్నారు. కార్యక్రమంలో జిల్లా జాయింట్ కలెక్టర్ టి.నిషాంతి, జిల్లా, సాగునీటి వినియోగదారుల అధ్యక్షుడు గుబ్బల శ్రీనివాస్, ప్రాజెక్ట్ డిస్ట్రిబ్యూటరీ సంఘాల ప్రతినిధులు జలవనరులశాఖ ఇంజినీర్లు పాల్గొన్నారు.

జిల్లాలో భారీ వర్షం

ఐ.పోలవరం: జిల్లా వ్యాప్తంగా బుధవారం మధ్యాహ్నం మూడు గంటల పాటు ఏకధాటిగా వర్షం కురిసింది. సగటున 9.08 సెంటీమీటర్ల పడింది. అత్యధికంగా అంబాజీపేట మండలంలో 16.78 సెంటీమీటర్లు కురిసింది. మండలాల వారీగా ఆత్రేయపురం 78.8 మి.మీ, మండపేట 25.6, రాయవరం 44.8, రామచంద్రపురం 72.2, ఆలమూరు 92.6, రావులపాలెం 133.8, కొత్తపేట 83.2, కపిలేశ్వరపురం 81.2, కె.గంగవరం 85.4. ఐ.పోలవరం 114.2, ముమ్మిడివరం 144.4, అయినవిల్లి 97.8, పి.గన్నవరం 148.4, రాజోలు 27.8, మలికిపురం 25.6, సఖినేటిపల్లి 36.4, అల్లవరం 132, అమలాపురం 133.2, ఉప్పలగుప్తం 92.4, కాట్రేనికోన 68.8 చొప్పున నమోదైంది. వర్షాలకు ఐ.పోలవరం, కాట్రేనికోన, ముమ్మిడివరం, ఉప్పలగుప్తం, అల్లవరం, మామిడికుదురు మండలాల్లో పెద్ద ఎత్తున వరి చేలల్లో ముంపునీరు చేరింది. అయితే వర్షం ఉద్యాన పంటలకు మేలు చేసింది. మరీ ముఖ్యంగా కొబ్బరి, కోకో, అరటి, పోక వంటి దీర్ఘకాలిక పంటలు వర్షంతో సేద తీరాయి.



అంబాజీపేటలో కురుస్తున్న వర్షం



జెండా పండగకు సర్వం సిద్ధం

- ముస్తాబైన బాలయోగి స్టేడియం
- ఏర్పాట్లు పూర్తి చేసిన యంత్రాంగం

అమలాపురం రూరల్: స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు జిల్లా కేంద్రమైన అమలాపురం ముస్తాబైంది. స్థానిక బాలయోగి స్టేడియంలో శుక్రవారం నిర్వహించే జెండా పండగకు కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్, డీఆర్వో మాధవి ఆధ్వర్యంలో ఏర్పాట్లు పూర్తి చేశారు. ముఖ్యఅతిథిగా రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ హాజరై జాతీయ జెండాను ఆవిష్కరిస్తారు. అనంతరం వివిధ శాఖల అధికారులకు ప్రశంసాపత్రాలు అందజేస్తారు. ఈ సందర్భంగా కలెక్టరేట్‌ను జాతీయ జెండాలు, స్వాగత తోరణాలతో సుందరంగా అలకరించారు. వేడుకలు జరిగే బాలయోగి స్టేడియంలో వేదికను అందంగా తీర్చిదిద్దారు. పోలీస్ పరేడ్‌కు ఏర్పాట్లు పూర్తి చేశారు. జిల్లాలోని వివిధ ప్రభుత్వ శాఖల పథకాలతో శకటాలను సిద్ధం చేస్తున్నారు.



అమలాపురంలో 600 అడుగుల జాతీయ జెండాను ప్రదర్శిస్తున్న విద్యార్థులు

600 అడుగుల జాతీయ జెండా ప్రదర్శన

అమలాపురం టౌన్: అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ (ఏబీవీపీ) అమలాపురం శాఖ ఆధ్వర్యంలో గురువారం అమలాపురంలో 600 అడుగుల జాతీయ జెండాతో విద్యార్థులు భారీ ర్యాలీ చేశారు. వివిధ విద్యాలయాలకు చెందిన సుమారు 500 మంది విద్యార్థులు భారతమాతకు జై అంటూ నినాదాలు చేస్తూ ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. విద్యానిధి విద్యా సంస్థల చైర్మన్ ఏబీ నాయుడు జెండా ఊపి ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఏబీవీపీ విభాగ్ కన్వీనర్ సత్య మాట్లాడుతూ విద్యార్థుల్లో దేశభక్తిని, స్వాతంత్ర్య స్ఫూర్తిని నింపేందుకు ఈ కార్యక్రమం చేపట్టామన్నారు. ర్యాలీకి ఏబీవీపీ రాష్ట్ర స్టూడెంట్ ఫర్ డెవలప్‌మెంట్ (ఎస్ఎఫ్‌డీ) కన్వీనర్ లలిత్ కుమార్ నాయకత్వం వహించారు.



బాలయోగి స్టేడియంలో సిద్ధం చేసిన వేదిక



కలెక్టరేట్‌లో జరుగుతున్న ఏర్పాట్లు

కొత్త ప్రయాణానికి శుభారంభం

యునైటెడ్ డయాగ్నోస్టిక్స్

MRI మరియు CT స్కాన్ సెంటర్

ఇప్పుడు మన రావులపాలెంలో

ది. 15.08.2025 శుక్రవారం సా॥ 4.00 గం॥లకు



ముఖ్య అతిథి:
గౌ॥ శ్రీ బండారు సత్యానందరావు గారు
శాసన సభ్యులు - కొత్తపేట నియోజకవర్గం

గౌరవ అతిథులు:
గౌ॥ శ్రీ చిర్ల జగ్గిరెడ్డి గారు
మాజీ శాసన సభ్యులు

గౌ॥ శ్రీ డా॥ కె.జి. శేషుబాబు గారు
అధ్యక్షులు - IMA, రావులపాలెం

గౌ॥ శ్రీ డా॥ వీర్రెడ్డి గారు
కార్యదర్శి - IMA, రావులపాలెం

యునైటెడ్ డయాగ్నోస్టిక్స్

డాక్టర్ బొబ్బా జయశ్రీ హాస్పిటల్ బిల్డింగ్, రావులపాడు రోడ్, రావులపాలెం.
ఫోన్: 08852-57876, 91216 51119

అంబాజీపేట కొబ్బరి మార్కెట్

కొబ్బరి రకం	ధర (రూ.ల్లో)
కొత్తకొబ్బరి (క్వింటాల్)	23,000 – 23,500
కొత్తకొబ్బరి (రెండో రకం)	10,500 – 12,000
కురిడీ కొబ్బరి (పాతవి)	
గండేరా (వెయ్యి)	30,000
గటగట (వెయ్యి)	27,000
కురిడీ కొబ్బరి (కొత్తవి)	
గండేరా (వెయ్యి)	29,000
గటగట (వెయ్యి)	26,000
నీటికాయ, పాత (ముక్కుడు)కాయ (వెయ్యి)	18,000 – 19,000
కొత్త (పచ్చి)కాయ (వెయ్యి)	18,000 – 19,000
కొబ్బరి నూనె (15 కిలోలు)	6,000
కిలో	400

క్లుప్తంగా

18 నుంచి జూనియర్ అసిస్టెంట్లు, టైపిస్టులకు శిక్షణ

సామర్లకోట: స్థానిక విస్తరణ శిక్షణ కేంద్రంలో ఈ నెల 18 నుంచి మండల పరిషత్తు, జిల్లా పరిషత్తులలో పనిచేస్తున్న జూనియర్ అసిస్టెంట్లు, టైపిస్టులకు శిక్షణ తరగతులు నిర్వహిస్తామని ఆ కేంద్రం ప్రిన్సిపాల్ కేఎస్వీ ప్రసాదరావు తెలిపారు. ఈ మేరకు గురువారం ప్రకటన విడుదల చేశారు. శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం, అనకాపల్లి, పార్వతీపురం మన్యం, అల్లూరి సీతారామరాజు, కాకినాడ, తూర్పుగోదావరి, అంబేడ్కర్ కోనసీమ, పశ్చిమ గోదావరి, ఏలూరు జిల్లాలోని 240 మందికి బ్యాచ్‌ల వారీగా శిక్షణ ఉంటుందన్నారు. 18 నుంచి ప్రారంభమయ్యే బ్యాచ్‌కు 60 మంది హాజరవుతారని, ఆయా కార్యాలయాల్లో కొత్తగా నియమితులైన వారికి ఈ శిక్షణ ఉంటుందన్నారు. వారం రోజుల పాటు జరిగే ఈ కార్యక్రమంలో వారి విధులు, బాధ్యతలు, ఫైళ్ల నిర్వహణ, ప్రభుత్వ పథకాలు వంటి అంశాలను నిపుణులు వివరిస్తారన్నారు.

జాతీయ హాకీ పోటీలకు ఉప్పాడ క్రీడాకారులు


చొక్కా డేవిడ్


మేరుగు హెబెల్


కొత్తపల్లి: పంజాబ్ రాష్ట్రంలోని జలంధర్‌లో జరిగే 15వ హాకీ ఇండియా జూనియర్ చాంపియన్ షిప్ పోటీల్లో పాల్గొనే మన రాష్ట్ర జట్టుకు ఉప్పాడకు చెందిన ఇద్దరు క్రీడాకారులు ఎంపికయ్యారు. ఈ విషయాన్ని స్థానిక జిల్లా పరిషత్ పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయుడు, హాకీ కోచ్ రవిరాజ్ గురువారం తెలిపారు. ధర్మవరంలో ఏప్రిల్‌లో జరిగిన రాష్ట్ర జూనియర్ హాకీ చాంపియన్ షిప్ పోటీల్లో ఉప్పాడకు చెందిన చొక్కా డేవిడ్, మేరుగు హెబెల్ ప్రతిభ కనబరిచి, చాంపియన్‌షిప్‌కు సాధించడంలో కీలకపాత్ర పోషించారన్నారు. ఈ క్రీడాకారులు స్కూల్ గేమ్ అండర్–19 జాతీయ పోటీల్లో కూడా పాల్గొన్నారన్నారు. కాగా.. జాతీయ జూనియర్ హాకీ పోటీలు శుక్రవారం నుంచి జలంధర్‌లో ప్రారంభమవుతాయని, శనివారం జరిగే పోటీల్లో ఈ క్రీడాకారులు పాల్గొంటారన్నారు.

మాస్టార్‌కి బుక్కు రిబిక్కి రి!

- జవాబులు రాసేందుకు అసెస్మెంట్ బుక్‌లెట్ల పంపిణీ
- పాఠశాలల్లో మూల్యాంకనానికి సమయం సరిపోదంటున్న టీచర్లు
- ఇప్పటికే బోధనేతర పనులతో సతమతమవుతున్నామని ఆవేదన


పరీక్షలు రాస్తున్న విద్యార్థులు

సాక్షి, అమలాపురం: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను అంచనా వేసేందుకు విద్యా సంవత్సరంలో ప్రతి ఏటా పరీక్షలు నిర్వహిస్తారు. నాలుగు సెల్ఫ్ అసెస్‌మెంట్ పరీక్షలు, రెండు సమ్మేటివ్ పరీక్షలను నిర్వహించడం పరిపాటిగా వస్తోంది. అందులో భాగంగా ప్రస్తుత విద్యా సంవత్సరంలో సెల్ఫ్ అసెస్‌మెంట్–1 పరీక్షలు ఈ నెల 11 నుంచి ప్రారంభమయ్యాయి. అయితే విద్యార్థులకు నిర్వహిస్తున్న పరీక్షలకు సంబంధించిన మూల్యాంకనం ఇప్పుడు సర్వత్రా చర్చనీయాంశంగా మారింది. పరీక్షల్లో ప్రశ్నలకు జవాబులు రాసేందుకు వైట్ పేపర్ల స్థానంలో అసెస్మెంట్ బుక్‌లెట్లు ఇవ్వడాన్ని ఉపాధ్యాయులు వ్యతిరేకిస్తున్నారు. ఇప్పటికే విద్యాశాఖ అమలు చేస్తున్న బోధనేతర పనులతో సతమతమవుతున్నామని ఒక పక్క ఆందోళన చేస్తుంటే..మరింత భారంగా అసెస్‌మెంట్ బుక్‌లెట్ విధానం ఉందని ఉపాధ్యాయులు ఆవేదన చెందుతున్నారు. ఉపాధ్యాయులపై పనిభారం పెంచేందుకు మాత్రమే ఈ విధానాన్ని తీసుకొచ్చారని ఉపాధ్యాయ సంఘాలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి. జిల్లాలో సెల్ఫ్ అసెస్‌మెంట్ పరీక్షలు 13వ తేదీతో ముగుస్తాయి. జిల్లాలోని ప్రభుత్వ యాజమాన్య పరిధిలో 1,561 ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో 89,625 మంది విద్యార్థులు పరీక్షలు రాస్తున్నారు.



ఒక్కో సబ్జెక్టుకు ఒక్కో బుక్‌లెట్

విద్యార్థులకు నిర్వహించే పరీక్షలకు సంబంధించి విద్యాశాఖ ద్వారా సరఫరా చేసిన అసెస్‌మెంట్ బుక్‌లెట్లపై ఉపాధ్యాయుల్లో వ్యతిరేకత వ్యక్తమవుతోంది. ప్రతి తరగతిలో ఒక్కో సబ్జెక్టుకు ఒక్కో అసెస్‌మెంట్ బుక్‌లెట్‌ను అందజేశారు. ఒకటి నుంచి 10వ తరగతి వరకు ఈ విధంగా ప్రతి తరగతి విద్యార్థికి అందజేశారు. 1వ తరగతి విద్యార్థికి నాలుగు అసెస్‌మెంట్ బుక్స్ ఉంటే, 10వ తరగతి విద్యార్థికి ఏడు బుక్‌లెట్లు అందజేశారు. ఒక్కో టీచర్ వారు బోధించే తరగతులు, సబ్జెక్టుల వారీగా అసెస్‌మెంట్ బుక్‌లెట్స్‌లో విద్యార్థులు రాసిన జవాబులను మూల్యాంకనం చేయాల్సి ఉంటుంది. విద్యాశాఖ ఉన్నతాధికారులు ఇస్తున్న పనులను చేసేందుకు అధిక సమయం వెచ్చించాల్సి వస్తున్న నేపథ్యంలో అసెస్‌మెంట్ బుక్‌లెట్లలో జవాబులు రాయించడం, మూల్యాంకనం చేయడం ఒక పెద్ద ప్రహసనంగా ఉందనేది ఉపాధ్యాయుల వాదన. విద్యార్థులు రాసిన జవాబులను మూల్యాంకనం చేసి, బుక్‌లెట్‌లో ఇచ్చిన ఓఎంఆర్ షీట్‌లో మార్కులు వేయడంతోపాటు వారు రాసిన పేజీలను స్కాన్ చేసి విద్యాశాఖ ఇచ్చిన లీప్ యాప్‌లో అప్‌లోడ్ చేయాల్సి ఉంటుంది. ఆ విధంగా అప్‌లోడ్ చేసే సందర్భంలో సర్వర్ బిజీగా ఉన్నా, నెట్‌వర్క్ లేకున్నా, నెట్‌వర్క్ నెమ్మదిగా ఉన్నా అప్‌లోడ్ ప్రక్రియలో తీవ్రమైన జాప్యం చోటు చేసుకుంటుంది.

అంత వీజీ కాదు

గతంలో విద్యార్థి రాసిన పరీక్ష పేపర్లను ఉపాధ్యాయులు వారి వెసులుబాటును బట్టి పాఠశాలలో లేదా పేపర్ కట్టలను ఇంటికి తీసుకువెళ్లి మూల్యాంకనం చేసేవారు. ఇప్పుడు బుక్‌లెట్లను ఇంటికి తీసుకుని వెళ్లాలంటే అంత వీజీ కాదని ఉపాధ్యాయులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బుక్‌లెట్ల బండిల్స్‌ను మోటార్ సైకిల్‌పై తీసుకుని వెళ్లడం సాధ్యం కాదని అంటున్నారు. తప్పనిసరిగా బడిలోనే దిద్ది ప్రతి సబ్జెక్టుకు సంబంధించి విద్యార్థులు రాసిన జవాబు పత్రాలను స్కాన్ చేసి అప్‌లోడ్ చేయాలి. ఒక్కొక్క విద్యార్థి మూడు పేజీలు రాస్తే వంద నుంచి 120 పేజీలను ఒక సబ్జెక్టుకు స్కాన్ చేయాల్సి ఉంటుంది. ఉన్నత పాఠశాలలో ఒక సబ్జెక్టు టీచర్ నాలుగు తరగతులకు వెళ్తుంటే ఆ ఉపాధ్యాయుడికి ఆ పని పూర్తి చేయడానికి కనీసం వారం నుంచి పది రోజుల సమయం పడుతుందని చెబుతున్నారు. ఈ మూల్యాంకనం బుక్‌లెట్లను భద్రపర్చడం కూడా కష్టమంటున్నారు.


అసెస్మెంట్ బుక్ లెట్లు తీసుకువెళ్లటానికి ఇలాంటి ట్రాలీలు అవసరమంటూ ఉపాధ్యాయుల వాట్సాప్ గ్రూపుల్లో మీమ్స్ హల్‌చల్ చేస్తున్నాయి

అధిక భారం



విద్యార్థులు ప్రశ్నలకు సమాధానాలను రాసేందుకు అసెస్‌మెంట్ బుక్‌లెట్లను వినియోగిస్తున్నారు. ఇది ఉపాధ్యాయులకు భారంగా ఉంది. బోధనకు కూడా సమయం సరిపోవడం లేదు. పూర్వపు పద్ధతిలోనే పేపరుపై జవాబులు రాసే విధానాన్ని అమలు చేయాలి.

– పి.సురేంద్రకుమార్, జిల్లా అధ్యక్షుడు, యూటీఎఫ్, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా

వ్యతిరేకిస్తున్నాం



ఉపాధ్యాయులకు పనిభారం పెంచేందుకే అన్నట్లుగా అసెస్‌మెంట్ బుక్‌లెట్లు ఉన్నాయి. పరీక్షా పత్రాలు కూడా విద్యార్థుల స్థాయికి మించి ఉన్నాయి. ఏ మాత్రం ఆమోదయోగ్యం కాని అసెస్‌మెంట్ బుక్‌లెట్ల విధానాన్ని వ్యతిరేకిస్తున్నాం. రాష్ట్ర స్థాయి అధికారుల దృష్టికి ఈ సమస్యను తీసుకువెళ్తాం.

– పోతంశెట్టి దొరబాబు, జిల్లా అధ్యక్షుడు, ఎస్టీయూ, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా

ఉపాధ్యాయులకే పరీక్ష




పరీక్షల విధానంలో కొత్తగా తీసుకుని వచ్చిన మూల్యాంకన విధానం ఉపాధ్యాయులకే పరీక్షలా ఉంది. ఉపాధ్యాయులపై తీవ్రమైన పనిభారం పడుతుంది. ఒక విధంగా చెప్పాలంటే పదవ తరగతి పబ్లిక్ పరీక్షలే మేలు అన్నట్లుగా ఉంది. దీన్ని మా సంఘం తరపున తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాం.

– పి.నరేష్‌బాబు, జిల్లా ప్రధాన కార్యదర్శి, ఆపస్ ఉపాధ్యాయ సంఘం, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా

కొబ్బరి చెక్క.. సిరులు పక్కా

- రత్నగిరిపై వేలం పాట
- నెలకు రూ.19.05 లక్షలకు ఖరారు
- సత్యదేవునికి రికార్డు స్థాయిలో ఆదాయం


అన్నవరంలోని సత్యనారాయణస్వామి దేవస్థానం

అన్నవరం: ప్రముఖ పుణ్యక్షేత్రమైన అన్నవరం సత్యనారాయణస్వామి దేవస్థానంలో కొబ్బరి ముక్కల వేలం రికార్డు ధరకు ఖరారైంది. గతంలో నెలకు రూ.7.26 లక్షలు ఉన్న వేలం ఈ సారి రూ.19.05 లక్షలు వెళ్లింది. అంటే దాదాపు మూడు రెట్లు పెరిగి సత్యదేవునికి సిరులు కురిపించింది. అన్నవరం దేవస్థానం చరిత్రలో ఒక వేలం ఇంత ఎక్కువ మొత్తానికి వెళ్లడం ఇదే ప్రథమం. రెండేళ్ల కాలపరిమితికి గాను గురువారం ఈ వేలం జరిగింది. దేవస్థానంలో వ్రతాలాచరించే భక్తుల నుంచి సేకరించే కొబ్బరి చెక్కలతో పాటు రావిచెట్టు వద్ద, వివిధ ఆలయాల్లో భక్తులు కొట్టే కొబ్బరి చెక్కలను పోగుచేసుకునేందుకు గతంలో విడివిడిగా వేలం నిర్వహించేవారు. అయితే దేవదాయశాఖ కమిషనర్ ఆదేశాల మేరకు ఆ రెండింటికీ కలిపి గురువారం ఒకే వేలం జరిపారు. ఈ కార్యక్రమంలో నలుగురు పాటదారులు పాల్గొన్నారు. గతంలో రెండు వేలం పాటల్లో నెలకు రూ.7.26 లక్షలు ఆదాయం వచ్చింది. గురువారం జరిగిన వేలంపాటలో రికార్డు స్థాయిలో రూ.19.05 లక్షలకు వెళ్లింది. దీంతో దేవస్థానానికి తొలి ఏడాది రూ.2.28 కోట్లు, రెండో ఏడాది పది శాతం పెరుగుదలతో సుమారు రూ. 2.51 కోట్లు ఆదాయం రానుంది. అంటే రెండేళ్లకు రూ.4.80 కోట్లు ఆదాయం సమకూరనుంది. అలాగే బుకింగ్ ఆఫీసు ఎదురుగా గల షాపింగ్ కాంప్లెక్స్‌లోని మూడో నంబర్ షాపులో కొబ్బరి కాయలు, అరటిపండ్లు విక్రయించేందుకు గాను గతంలో నెలకు రూ.2.33 లక్షలు ఉండగా ఇప్పుడు ఆ వేలం పాట నెలకు రూ.3.78 లక్షలకు వెళ్లింది. ప్రకాష్ సదన్ సత్రం వెనుక మినీ క్యాంటీన్ వేలం నెలకు రూ.2.82 లక్షలకు వేలం ఖరారైంది. దేవస్థానం ఈఈ నూకరత్నం, ఏఈఓ ఎల్ శ్రీనివాస్, సీ సెక్షన్ సూపరింటెండెంట్ వెంకట రమణ తదితరులు వేలం నిర్వహించారు.

బైక్ దొంగల అరెస్టు

- 34 వాహనాల స్వాధీనం
- వివరాలు వెల్లడించిన డీఎస్పీ రమేష్ బాబు


నిందితుల వివరాలు వెల్లడిస్తున్న పోలీసులు

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో మోటారు సైకిళ్లను దొంగిలిస్తున్న ముగ్గురిని త్రీటౌన్ పోలీసులు గురువారం అరెస్టు చేశారు. జిల్లా ఎస్పీ డి.నరసింహ కిశోర్ ఆదేశాల మేరకు రంగంలోకి దిగిన పోలీసులు బైక్ దొంగలను చాకచక్యంగా పట్టుకున్నారు. ఆ వివరాలను త్రీటౌన్ పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సెంట్రల్ జోన్ డీఎస్పీ కె.రమేష్ బాబు వివరించారు. మోటారు సైకిళ్ల దొంగతనాలు ఎక్కువైన నేపథ్యంలో త్రీటౌన్ సీఐ వి.అప్పారావు నేతృత్వంలో దొంగలపై నిఘా పెట్టారు. దీనిలో భాగంగా కాతేరు గామన్ బ్రిడ్జి వద్ద పోలీసులు వాహనాల తనిఖీ చేస్తున్నారు. ఆ సమయంలో ఉండ్రాజవరం మండలం సత్యవాడలోని రామాలయం వీధికి చెందిన కుప్పాల రంగారావు, పసలపూడికి చెందిన గోపిరెడ్డి యోహాన్, అరుంధతిపేటకు చెందిన సిర్రా బంగారుబాబు రాజమహేంద్రవరం వైపు నుంచి వెంకటనగరం వైపు వెళుతున్నారు. ఆ ముగ్గురిని పోలీసులు ఆపి వాహనాల రికార్డులను అడిగారు. వారి వద్ద ఎటువంటి రికార్డులు లేకపోవడంతో అనుమానం వచ్చి విచారణ చేశారు. దీంతో వారు అపహరించిన మోటారు సైకిళ్ల వివరాలను తెలిపారు. వీరిపై త్రీటౌన్ పోలీస్ స్టేషన్‌తో పాటు భీమవరం, గుడివాడ, ఏలూరు పోలీస్ స్టేషన్లలో కేసులు నమోదయ్యాయి. నిందితుల నుంచి 34 మోటారు సైకిళ్లను స్వాధీనం చేసుకున్నారు. బైక్ దొంగలను పట్టుకున్న సీఐ వి.అప్పారావు, ఎస్సై అప్పలరాజు, హెడ్ కానిస్టేబుల్ వి.కృష్ణ, ఎన్.వెంకట రామయ్య, కె.సురేష్, చంద్రశేఖర్, విజయ్‌కుమార్, మహేష్ పవన్‌లను ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు.

ప్రాణం తీసిన చెట్టు

- ఉద్యోగానికి వెళుతుండగా కూలిన వృక్షం
- దుళ్ల యువకుడి మృతి


తొట్టా శ్రీనివాస్ (ఫైల్)

కడియం: చెట్టు కూలి మీద పడడంతో ఉద్యోగ బాధ్యతలు నిర్వహించడానికి వెళుతున్న యువకుడు మృతి చెందాడు. పాయకరావుపేట మండలం రాంభద్రపురం – శ్రీరాంపురం మధ్య ఈ ఘటన జరిగింది. వివరాల్లోకి వెళితే.. కడియం మండలం దుళ్ల గ్రామానికి చెందిన తొట్టా శ్రీనివాస్ (31) అనకాపల్లి జిల్లా కేశవరం డెక్కన్ కెమికల్స్ ఫ్యాక్టరీలో ఉద్యోగం చేస్తున్నాడు. రోజూ మాదిరిగానే గురువారం తన క్వార్టర్స్ నుంచి స్నేహితుడితో కలిసి ఫ్యాక్టరీకి వెళుతున్నాడు. రాంభద్రపురం–శ్రీరాంపురం మధ్యకు వచ్చేసరికి ఓ భారీ వృక్షం కూలి వీరు వెళుతున్న మోటారు సైకిల్‌పై పడింది. దీంతో శ్రీనివాస్ అక్కడికక్కడే మృతి చెందగా, స్నేహితుడు తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికుల సమాచారంతో సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు.. చెట్టు కింద ఉన్న శ్రీనివాస్ మృతదేహాన్ని వెలికితీసి పోస్టుమార్టానికి తరలించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

తల్లిదండ్రులకు ఒక్కడే సంతానం

శ్రీనివాస్‌కు రెండేళ్ల క్రితమే వివాహమైంది. పెళ్లయిన తర్వాత ఆరు నెలలకు అనకాపల్లి జిల్లా కేశవరంలోని డెక్కన్ ఫ్యాక్టరీలో ఉద్యోగం వచ్చింది. దీంతో తునిలోని బ్యాంక్ కాలనీలో భార్యతో సహా నివాసం ఉంటున్నాడు. శ్రీనివాస్ తల్లిదండ్రులకు ఒక్కడే కొడుకు. అతడి హఠాన్మరణంతో వారంతా తీవ్ర విషాదంలో కూరుకుపోయారు. కాగా.. దుళ్లలో మృతుడి కుటుంబాన్ని పలువురు పరామర్శించి, తమ ప్రగాఢ సానుభూతి తెలిపారు.

దేవస్థానం ఆస్పత్రి వైద్యాధికారిగా హరికృష్ణ



అన్నవరం: స్థానిక దేవస్థానం ఆస్పత్రి వైద్యాధికారిగా డాక్టర్ అల్లు హరికృష్ణ గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన ఇప్పటి వరకు తుని అర్బన్ పీహెచ్‌సీలో పనిచేశారు. అక్కడ రాజీనామా చేసి అన్నవరంలో చేరారు. డాక్టర్ హరికృష్ణ అనస్థీషియాలో ఎండీ కూడా చేశారు. గతంలో దేవస్థానం ఆస్పత్రి వైద్యాధికారిగా పనిచేసిన శ్రీకాంత్ గత నెల 12న రౌతులపూడి ఆస్పత్రి డాక్టర్‌గా నియమితులవ్వడంతో ఈ పోస్టు అప్పటి నుంచి ఖాళీగా ఉంది. గత నెల 31న స్మార్త ఆగమ పాఠశాల విద్యార్థులు తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. ఆ సమయంలో దేవస్థానం ఆస్పత్రిలో వైద్యాధికారి లేక సకాలంలో వైద్యం లభించలేదు. వారి పరిస్థితి విషమించడంతో తుని ప్రభుత్వాస్పత్రికి పంపాల్సి వచ్చింది.

సాక్షి ఇంపాక్ట్

'సాక్షి' చొరవతో..


ఈ సమస్యపై ఆగస్టు ఏడున సాక్షి దినపత్రికలో 'వైద్యం... పూజ్యం ' శీర్షికన వార్త ప్రచురితమైంది. దానిపై స్పందించిన కమిషనర్ రామచంద్ర మోహన్ వెంటనే వైద్యుడిని నియమించేందుకు చర్యలు తీసుకోవాలని దేవస్థానం అధికారులను ఆదేశించారు. దీంతో డాక్టర్ హరికృష్ణను నియమించారు. ఆయన గురువారం దేవస్థానం ఈఓ వీర్ల సుబ్బారావును మర్యాదపూర్వకంగా కలిశారు.

పారా అథ్లెటిక్స్ పోటీలకు పార్థు ఎంపిక


సబ్బతి పార్థు సంజీవ సాగర్

ముమ్మిడివరం: కొత్తలంక జెడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన పదో తరగతి విద్యార్థి సబ్బతి పార్థు సంజీవ సాగర్ జాతీయ స్థాయి పారా అథ్లెటిక్స్ పోటీలకు ఎంపికయ్యాడు. ఈ విషయాన్ని పాఠశాల ప్రత్యేక విద్య ఉపాధ్యాయుడు గంగుల సురేష్ తెలిపారు. ఈ మేరకు ఏపీ పారా స్పోర్ట్స్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి రామస్వామి నుంచి గురువారం ఉత్తర్వులు అందాయన్నారు. మధ్యప్రదేశ్‌లోని గ్వాలియర్‌లో ఈ నెల 29న జరిగే జాతీయ పోటీలలో పార్థు పాల్గొంటాడన్నారు. కాగా.. జాతీయ పోటీలకు ఎంపికైన పార్థును డీఈఓ షేక్ సలీం బాషా, ఎంఈఓలు గౌరీ శంకర్, ఉదయ భాస్కర్, కో ఆర్డినేటర్ ఎంవీవీ సత్యనారాయణ, జైను బాబ్జీ, హెచ్ఎం గోవర్ధన్ గిరి, ఉపాధ్యాయులు అభినందించారు.

ఒకే కాన్పులో ముగ్గురు శిశువుల జననం


ఒకే కాన్పులో జన్మించిన ముగ్గురు శిశువులు

కొత్తపేట: ఒకే కాన్పులో ముగ్గురు శిశువులు జన్మించిన ఘటన కొత్తపేటలోని భాస్కర పిల్లల ఆసుపత్రిలో గురువారం చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే.. అమలాపురం సమీపంలోని ఈదరపల్లికి చెందిన కుంపట్ల దుర్గ, సతీష్ దంపతులకు పెళ్లయి రెండేళ్లయినా సంతానం కలగలేదు. దీంతో కొత్తపేటలోని భాస్కర చిల్డ్రన్స్ ఐవీఎఫ్ ఆసుపత్రి డాక్టర్ ప్రదీప్తి కరణను సంప్రదించారు. ఆమె వైద్యంతో గర్భధారణ సాధ్యమైంది. స్కానింగ్‌లో ముగ్గురు పిల్లలు ఉన్నట్టు గుర్తించి, ఇది కొంత ప్రమాదమని వైద్యులు హెచ్చరించారు. అయితే తల్లిదండ్రులు ధైర్యంగా ముందుకు వచ్చారు. ఎనిమిదో నెలలో దుర్గకు నొప్పులు రావడంతో డాక్టర్ ప్రదీప్తి కరణ బృందం ఆపరేషన్ చేసి సురక్షితంగా ముగ్గురు శిశువులను బయటకు తీసింది. మొదటి అమ్మాయి, తర్వాత అబ్బాయి, చివరగా అమ్మాయి జన్మించారు. ప్రస్తుతం తల్లి, పిల్లలు క్షేమంగా ఉన్నారు. పిల్లలను అదే ఆసుపత్రిలోని పిల్లల వైద్యుడు మెంటే శ్రీధర్ ప్రత్యేక పర్యవేక్షణలో పరిశీలిస్తున్నట్టు తెలిపారు.

వేడుకల వేళ విషాదం

- కొత్త దుస్తులు కొనుగోలు చేసేందుకు వెళుతుండగా ప్రమాదం
- తండ్రి మృతి, కుమారుడికి గాయాలు


బాలకృష్ణ (ఫైల్)


బాలకృష్ణ మృతదేహం వద్ద రోదిస్తున్న సోదరుడు ప్రకాష్

తాళ్లరేవు: స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా దుస్తులు కొనుగోలు చేసేందుకు నాలుగేళ్ల కుమారుడితో కలిసి వెళ్లిన వ్యక్తి రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. కోరంగి ఎస్సై పి.సత్యనారాయణ, మృతుడి కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. కాజులూరు మండలం శీల్లంక గ్రామానికి చెందిన జల్లి బాలకృష్ణ (33) అలియాస్ బాలాజీ కోరంగి పోలీస్ స్టేషన్ సమీపంలో నూడుల్స్ వ్యాపారం చేసుకుంటూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. జెండా పండగ కోసం తన కుమారుడు చాణక్యకు కొత్త దుస్తులు కొనేందుకు గురువారం ఆ బాలుడిని తీసుకుని యానాం బయలుదేరాడు. వారిని యానాం బైపాస్‌లో మంగళ ఎంటర్‌ప్రైజెస్ వద్ద మినీ వ్యాన్ వేగంగా ఢీకొని వెళ్లిపోయింది. ఈ ప్రమాదంలో బాలాజీ అక్కడికక్కడే మృతి చెందగా, చాణక్యకు స్వల్పగాయాలయ్యాయి. స్థానికులు హుటాహుటిన బాలుడిని యానాం ప్రభుత్వాస్పత్రికి తరలించగా చికిత్స పొందుతున్నాడు. ప్రమాదాన్ని పసిగట్టిన బాలాజీ తన కుమారుడిని గుండెలకు హత్తుకుని పట్టుకోవడంతో ఆ బాలుడు ప్రమాదం నుంచి బయటపడినట్లు స్థానికులు చెబుతున్నారు. బాలాజీ మృతదేహం వద్ద అతడి సోదరుడు ప్రకాష్ బోరున రోదించారు. మృతుడికి భార్య, ఒక కుమారుడు ఉన్నారు. ఆమె ప్రస్తుతం గర్భిణి. కాగా.. పోలీసులు సీసీ కెమెరా ఫుటేజీలను పరిశీలించి ప్రమాదానికి కారణమైన వాహనాన్ని గుర్తించి, డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆత్మవిశ్వాసాన్ని దెబ్బతిసే ర్యాగింగ్


మాట్లాడుతున్న కలెక్టర్ ప్రశాంతి, చిత్రంలో వీసీ ఆచార్య ప్రసన్నశ్రీ

రాజానగరం: విద్యార్థి దశలో జూనియర్లను ర్యాగింగ్ చేయడం ఆనందమని సీనియర్లు భావిస్తారని.. కానీ అది ఆ విద్యార్థి ఆత్మవిశ్వాసాన్ని దెబ్బతీస్తుందనే విషయాన్ని గ్రహించలేకపోతున్నారని కలెక్టర్ పి.ప్రశాంతి అన్నారు. ఆదికవి నన్నయ యూనివర్సిటీలో నిర్వహిస్తున్న యాంటీ ర్యాగింగ్ వీక్ కార్యక్రమంలో భాగంగా గురువారం జరిగిన అవగాహన కార్యక్రమంలో కలెక్టర్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. తన జీవితంలో కూడా ర్యాగింగ్‌కు భయపడిన సంఘటనలు ఉన్నాయంటూ గుర్తు చేసుకున్నారు. ఎవరూ ర్యాగింగ్‌కు పాల్పడవద్దని, పాల్పడితే చట్టాల నుంచి తప్పించుకోలేరని హెచ్చరించారు. ప్రతి తల్లి, తండ్రి తమ పిల్లలను ర్యాగింగ్‌కు దూరంగా ఉంచాలని చూస్తారని, అందుకోసమే ర్యాగింగ్ ఛాయలు లేని కళాశాలలు, యూనివర్సిటీలను ఎంపిక చేసుకుంటున్నారన్నారు. ర్యాగింగ్ వలన జీవితాలు నాశనం అవడమే కాకుండా కన్నవారికి, చదువుకునే సంస్థలకు కూడా చెడ్డ పేరు వస్తుందన్నారు. వీసీ ఆచార్య ప్రసన్నశ్రీ మాట్లాడుతూ 'నన్నయ' వర్సిటీ అంటేనే సత్ప్రవర్తనకు కేరాఫ్ అనే ఖ్యాతిని పొందేలా మీ నడవడిక ఉండాలని విద్యార్థులకు హితవు పలికారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య కేవీ స్వామి, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఎస్‌బీఐ ఏటీఎంలో చోరీకి యత్నం

నిడదవోలు రూరల్: మండలంలోని తాడిమళ్ల ప్రధాన సెంటర్‌లో ఉన్న ఎస్‌బీఐ ఏటీఎం చోరీకి విఫలయత్నం జరిగింది. స్థానిక ఎస్‌బీఐ బ్రాంచ్ పక్కన ఉన్న ఈ ఏటీఎంలో బుధవారం అర్ధరాత్రి తర్వాత ఈ సంఘటన జరిగింది. ఈ మేరకు గురువారం బ్యాంకు మేనేజర్ రవి అందించిన సమాచారంతో సమిశ్రగూడెం ఎస్సై ఎల్.బాలాజీ సుందరరావు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. ఏటీఎంలోకి ప్రవేశించిన దొంగలు ముందుగా సీసీ కెమెరాలను ధ్వంసం చేశారు. డబ్బులను చోరీ చేసేందుకు ఏటీఎం ముందు భాగాన్ని పగులగొట్టారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

సాక్షి క్లాసిఫైడ్స్

Real Estate

FLAT FOR SALE

- 2 BHK FULLY FURNISHED FLAT for SALE , Power Backup, Ongole , Contact - 9845747380 [HA-14556]

LAND FOR SALE

- నివాస స్థలం అమ్మబడును. రాజానగర్–కాకినాడకి వెళ్ళే ప్రధాన రహదారి నుండి కేవలం 150 మీటర్ల దూరంలో వడిసలేరు గ్రామ పరిధిలో 728 చదరపు గజాలు (15 సెంట్లు)అమ్మబడును.ఆసక్తిగలవారు దిగువ నంబర్‌ను సంప్రదించండి. 9113842185 [HA-14620]

PLOT FOR SALE

- రాజమండ్రి, నారాయణపురంలో KSN ఇండోర్ స్టేడియం దగ్గర North ఫేసింగ్ 500 Sq yards అమ్మకమునకు కలదు. Contact : Phone / WhatsApp ✆ : 80748 57055 [R-1068]
- మూలపేట ఉప్పాడ దగ్గర 9 ఎకరాలు పొలం రిసార్ట్స్, ఆక్వాకల్చర్‌కి అనువైనది. మరియు అన్నవరంలో న్యూ ప్రసాదం కాంప్లెక్స్ దగ్గర 2 రెసిడెన్షియల్ ప్లాట్లు అమ్మకమునకు కలవు. ✆ : 89789 11154 [SCA25007278]

Wanted

- ★ కంప్యూటర్ డేటా ఎంట్రీ ఆపరేటర్స్ (Male) ★ నర్సులు కావలెను. ప్రగతి సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్, ప్రకాష్‌నగర్, మెయిన్‌రోడ్, రాజమండ్రి. [R-251]
- శ్రీ వెంకటేశ్వర I.T.I కోచింగ్ తాళ్ళరేవులో Instructor గా చేయుటకు బి.టెక్, డిప్లొమా Mech, EEE కలిగినవారు కావలెను. 9949215447 [SCA25007282]
- Required manager agents salary and incentives marketing job guarantee income age : 50 above Contact : 9010809384 [SCA25007256]
- కన్సల్టెన్సీ కాదు VIP ఇంట్లో పెద్దవాళ్ళని చూసుకోవడానికి స్త్రీలు/పురుషులు, ఆయా, నర్సులు, వంటవారు, RMP & డాక్టర్స్ కావలెను. జీ: 15 వేలు – 40వేలు, ఫ్రీ రూం+భోజనం. Hyd. 7995365999 [HA-16125]
- పైడా కాలేజీ, పటవల యందు పని చేయుటకు అనుభవజ్ఞులైన ఎలక్ట్రీషియన్లు, ప్లంబర్లు, సెక్యూరిటీ గార్డులు కావలెను. ఆకర్షణీయమైన జీతం ఇవ్వబడును. వివరాలకు ఫోన్ : 98481 92527, 83310 40530 [HA-14613]

PACKERS & MOVERS

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.